క్లుప్తంగా

అలరించిన గానకచేరి



పాత గీతాలు ఆలపిస్తున్న డీటీసీ వడ్డి సుందర్

విజయనగరం టౌన్: ఆనంద గజపతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సుందర్ సునేహర్ గీత్ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. విశాఖ పట్టణం డీటీసీ వడ్డి సుందర్ హిందీ చిత్రాల్లోని ఆపాత మధురాలను హృద్యంగా ఆలపించి చూపరులను కట్టిపడేశారు. అదేవిధంగా సింగర్లు అమ్మాజీరావు, అభినయ్ గంటి, ఉమాశంకర్, కావ్య చంద్రిక, గీతా సుబ్రహ్మణ్యం, గీతిక, భూమికలు పాడిన పాటలు మన్ననలందుకున్నాయి. కార్యక్రమానికి యాంకర్‌గా జోషిత వ్యవహరించారు. ఇండియన్ ఐడల్ ఫేమ్ సాయి, పవన్‌ల సంగీత సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాపుగంటిప్రకాష్, ఘంటసాల స్మారక కళా పీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

దీపంతో జ్ఞాన వెలుగులు



రఘుమండలో త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రజలకు వివరిస్తున్న సమితి ప్రతినిధులు

డెంకాడ: దీపం జ్ఞాన వెలుగులను పంచుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక విజయగనరం పట్టణ అధ్యక్షుడు బత్తుల గోవింద అన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ, ప్రచార కార్యక్రమాన్ని వేదిక ప్రతినిధులు మండంలంలోని రఘుమండ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్తీక పౌర్ణమి రోజున దేవాలయాల్లోని ధ్వజస్తంభం వద్ద దీపం వెలిగించడం చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు తులసీరావు, ములగాడ వినోద్‌కుమార్, ధనుంజయ్, శ్రీదేవి, శ్రీనివాస్, నారాయణమ్మ, కిరణ్, సాయి, ధనలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

విజయనగరం: కార్తీక పౌర్ణమి సందర్భంగా పూల్‌బాగ్ అయ్యప్పస్వామి దేవాలయంలలో ఆదివారం రాత్రి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అయ్యప్ప సేవా సంఘ అధ్యక్షుడు కట్టమూరి శంకరరావు మాట్లాడుతూ, కార్తీక పౌర్ణమి సందర్భంగా పవిత్ర పడిపూజకు వేలాది మంది అయ్యప్ప భక్తుల హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సతీష్, కోశాధికారి రవ్వా వెంకటేశ్వరరావు, ఆల్తి నాగరాజు, పెంటపాటి రాంజీ, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మహోన్నతమూర్తి



స్తుతి గీతాలాపన చేస్తున్న పాస్టర్ అలజంగి రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: మానవులకు సాయపడే మహోన్నతమూర్తి ఏసుక్రీస్తు అని పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. స్థానిక ఏసు ప్రేమాలయంలో మినీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీస్తు బోధనలను ఆరాధకులకు వివరించి, క్రీస్తు అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో క్రిస్మస్ రోజు వరకు నెలరోజుల పాటు ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని, ఆరాధకులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా డేనియల్ హాజరయ్యారు. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, విక్టర్‌బాబు, కోరాడ నాగేశ్వరరావు, చౌదరి, కలివరపు కిశోర్, సూర్యనారాయణ, దేవరాజు, ఝాన్సీ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఆదివారం మాదిరిగానే ఈ ఆదివారం కూడా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం దేవస్థానంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రిజర్వేషన్లు అంబేడ్కర్ కృషి ఫలితమే...

- ఆయన ఆశయ సాధనతో ముందుకెళ్లాలి
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



విజయనగరం: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిరిసహస్ర, యువత



పూసపాటిరేగ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: అంబేడ్కర్ ఆశయాలతో యువత ముందుకు వెళ్లాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని గుంపాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగాగా ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వాలకు పెద్దపీట వేశారన్నారు. ప్రస్తుతం మనదేశంలో అమలవుతున్న బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఆయన కృషి ఫలితమేనన్నారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదించారని, అప్పటి నుంచి ఆ రోజును రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్,విద్యార్థులు



విజయనగరం పూల్‌బాగ్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం..

విజయనగరం: ప్రపంచం గర్వించే రాజ్యాంగాన్ని రూపొందించిన బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా యువత ముందుకు సాగాలని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర పిలుపునిచ్చారు. నగరంలోని ధర్మపురిలో గల సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బాబా సాహెబ్ ఆశయాలను కొనసాగించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రస్తుతం బడుగు, బలహీనవర్గాలకు అమలవుతున్న రిజర్వేషన్లు అయన కృషి ఫలితమేనని చెప్పారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.



విజయనగరం క్రైమ్: అంబేడ్కర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఆర్‌ఐ గోపాలనాయుడు

లౌకిక వాదానికి ప్రతీక..

విజయనగరం క్రైమ్: భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 74 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) ఎన్.గోపాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లౌకికవాదమే పునాదిగా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అనుభవిస్తూనే, బాధ్యతలను కూడా నెరవేర్చాల్సిన అవసరం ప్రతి పౌరునిపైనా ఉందని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు ఎన్.గోపాలనాయుడు, టి.శ్రీనివాసరావు, ఆర్‌ఎస్సైలు నారాయణరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు..

డెంకాడ: మండల కేంద్రంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ వై.మహేష్ మాట్లాడుతూ, సమసమాజ స్థాపనకు అంబేడ్కర్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలించాలి..

విజయనగరం పూల్‌బాగ్: రాజ్యాంగం ద్వారా ఆర్థిక సమన్యాయం కల్పించడంతో పాటు అంటరానితనాన్ని నిర్మూలించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోకా రమేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవం సంద్బంగా ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి సంఘం ప్రధాన కార్యదర్శి రెగేటి సంతోష్‌తో కలిసి పూలమాల వేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు పుక్కెళ్ళ షణ్ముఖరావు, కింతాడ అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్వాలా తోరణం



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో జ్వాలాతోరణంలో పల్లకీతో నడుస్తున్న భక్తులు

విజయనగరం: పట్టణంలోని అయ్యకోనేరు దక్షిణగట్టులో గల ఉమామహేశ్వరాలయంలో కార్తీకపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్తీకమాసం సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జ్వాలాతోరణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది శివ దీక్షాదారులు, భక్తులు పాల్గొన్నారు. ముందుగా పార్వతీ,పరమేశ్వరులకు అర్చకులు శ్రీనివాసాచార్యులు, సందీప్ శర్మలు పూజాధికాలు చేసి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు.



నెల్లిమర్ల రూరల్: స్వామివారి పల్లకీసేవలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

రామతీర్థంలో ..

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో జ్వాలా తోరణం కార్యక్రమం ఆదివారం రాత్రి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో జ్వాలా తోరణం కార్యక్రమాన్ని కనుల పండువగా చేపట్టారు. ముందుగా ఉమా సదాశివుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం జ్వాలా తోరణం వెలిగించి స్వామి వారిని పల్లకిలో తిరువీధి ఉత్సవాన్ని జరిపించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్వామి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, శివ భక్తులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 43వ డివిజన్ ఉడా ఫేజ్ 2లో నిరుపయోగంగా ఉన్న పార్కు ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్కు పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. అయితే పర్యవేక్షణ బాధ్యతలు స్థానికులే చూసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది వాకింగ్ ట్రాక్, లైట్లు, ఓపెన్ జిమ్, రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి కోలగట్ల సానుకూలంగా స్పందించి, పనులు చేపడతామన్నారు.



పార్కును పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

రానున్న రోజుల్లో విజయనగరాన్ని సమస్యల్లేని పట్టణంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. ప్రజలు మరోసారి అవకాశాన్ని ఇచ్చినట్లయితే తప్పనిసరిగా మిగిలి ఉన్న అన్ని సమస్యలను తీర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సత్యవతి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు వంతరం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యాదవ సంఘ వన సమారాధన



వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని సీపీ ఆక్వా పరిశ్రమ సమీపంలో గల మామిడితోటలో యాదవ సంఘ కార్తీక వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. యాదవ సంఘ నాయకుడు నక్కాన రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేలాదిమంది యాదవలు పాల్గొన్నారు. కృష్ణుడు విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. వనభోజన ప్రాంగణంలో తప్పెటగుళ్లు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ లోకం మాధవి, యాదవ సంఘ అధ్యక్షుడు మన్యాల కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యాదవులు ఐకమత్యంతో ఒకరికొకరు సహకారం అందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, ప్రజాప్రతినిధి మహంతి జనార్దనరావు, యాదవ సంఘ నాయకులు బమ్మిడి రమణ, డొప్ప జోగులు, పల్ల సత్యం, గుడ్డాల రమణ, కుమిలి శ్రీను, దువ్వ ఆది, చింతపల్లి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న గ్రామస్తులు

నెల్లిమర్ల రూరల్: భర్తను కోల్పోయి కష్టాల్లో ఉన్న మహిళను ఆదుకునేందుకు పలువురు ముందుకొస్తున్నారు. తమకి తోచిన విధంగా సహకారం అందిస్తూ భరోసా కల్పిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని పెద్ద బూరాడపేట గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు రమణ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి పావనితో పాటు ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి స్థానిక యువత, పెద్దలు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. మృతుడు రమణతో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ.30 వేలు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ తరపున రూ.10వేలు, గ్రామస్తుల మరో పది వేల రూపాయలు, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మక్కువ వెంకటరమణ, బెల్లాన రామారావు, ఎం.రమణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 53మంది యువకులు స్వచ్ఛం దంగా రక్తదానం చేశారు. ఈసందర్భంగా సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. యువత రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించా లని కోరారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్, సమాజ సేవకులు ఆరిశెట్టి భాస్కర్, ప్రసాద్, కె.ఎ.ఎస్. ఎస్.గుప్త, కె.రామునాయుడు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రమ్య, అజయ్, జశ్వంత్, యశ్వంత్‌నాయుడు, రాము నాయుడు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల వేలం రేపు

జామి: వివిధ కేసుల్లో సీజ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఈనెల 28వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ వీరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక టీవీఎస్ ఎక్స్‌ఎల్, ఒక హీరో హోండా, ఒక హీరో స్ప్లెండర్ బైక్ వేలం వేస్తామని, ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చిన ఘనత జగనన్నదే..



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సోషల్ మీడియా ప్రతినిధులతో బడ్డుకొండ మణీదీప్‌నాయుడు, ప్రదీప్‌నాయుడు

- రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ -1 ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణీదీప్‌నాయుడు

భోగాపురం: కుల,మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ -1 ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, ఆయన సోదరుడు ప్రదీప్ నాయుడు అన్నారు. మండలంలోని లింగాలవలసలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయా సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో 600 హామీలను పొందుపరిచి, అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఏద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 99.5 శాతం అమలు చేశారని చెప్పారు. 2019 ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రతినిధులు టీడీపీ చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయడంలో సఫలమయ్యారన్నారు. అదేస్ఫూర్తిని కొనసాగిస్తూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈనెల 28 నెల్లిమర్ల నియోజకవర్గం కేంద్రంలో జరగబోయే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో 175కు 175 సీట్లు సాధించి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వై. వాసుపల్లినాయుడు, కో కన్వీనర్లు కె. సురేష్, బాకీ వెంకటరమణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 6న జీపుజాతా

విజయనగరం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని వచ్చే నెల 6న విజయనగరం జిల్లా కేంద్రంలో చైతన్య జీపు జాతా నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ అందరివాడు సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ బొంగ భానుమూర్తి తెలిపారు. ఈ మేరకు నగరంలోని బాలాజీ జంక్షన్ సమీపంలో గల అంబేడ్కర్ సామాజిక భవనంలో జీపుయాత్ర కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ, అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీనవర్గాలకు జరుగుతున్న మేలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఆర్టికల్ 340 ద్వారా బీసీ కమిషన్ ఏర్పాటు కావడంతో బీసీ ,ఓబీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ల ఫలాలు అందుతున్నాయని చెప్పారు. డిసెంబర్ 6న చేపట్టనున్న జీపు జాతాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సత్యవతి, సమితి ప్రతినిధులు పూసర్ల మధుసూదనరావు, మల్లాన స్వాతి, చిన్నం అరుణ్‌కుమార్, కూన స్రవంతి, మల్లాన సంతోష్, అలమండ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



జీపుజాతా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ అందరివాడు సాధన సమితి ప్రతినిధులు

రక్తదానం సామాజిక బాధ్యత



60వ సారి రక్తదానం చేసిన దుర్గాప్రసాద్‌ని సత్కరిస్తున్న అతిథులు

- సాధన యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్

నెల్లిమర్ల: రక్తదానం సామాజిక బాధ్యతని వక్తలు అభిప్రాయపడ్డారు. జరజాపుపేటలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో సాధన యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ 60వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్సై పి. నారాయణ రావు, గరివిడి ఎంఈఓ పొలుబోతు రామారావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత సామాజిక చైతన్యంతో రక్తదానం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సాధన యువజన సంఘం చేస్తున్న సేవలు గ్రామానికి మరింత వన్నె తీసుకువస్తున్నాయని చెప్పారు. ఈ మేరకు సంఘ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, పి.సత్యనారాయణ, మద్దిల శ్రీనివాసరావు, అవనాపు మురళి, నల్లి శివ, ఒంగ్రు శ్రీనివాసరావు, బోలే రమణారావు, మద్దిల సత్యనారాయణ, మద్దిల మురళి, మద్దిల రాజు, దుర్గాశేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.